క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నామని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూరారం కాలనీలో రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సర్వే నం.49, 107లలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

బడుల్లో వసతులు మెరుగు పరచడంలో విఫలం

సుభాష్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరచడంతో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమయ్యారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జోత్స్నారెడ్డి ఆరోపించారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను కాంగ్రెస్ పార్టీ బృందంతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జోత్స్నారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో సరైన నిర్వహణ లేకపోవడంతో ఆటస్థలం చెత్తాచెదారం పేరుకుపోయిందని, బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. విద్యనభ్యసించేందుకు పాఠశాలకు వచ్చే విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే అవకాశముందని, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలని ఆమె కోరారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



ప్రగతినగర్ ఇన్‌కాయిస్ రోడ్డులో భారీగా చేరిన వరదనీరు

నిజాంపేట్: ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రగతినగర్ శ్రీకృష్ణగార్డెన్స్, ఇన్‌కాయిస్ సమీపంలోని రోడ్డుపై భారీగా వరదనీరు చేరింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మోకాలు లోతు వరదనీటిలో కొందరి ద్విచక్ర వాహనాలు ఆగిపోయాయి. దీంతో ఈ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

అతివేగంతో పల్టీకొట్టిన కారు



ఓల్డ్ జీడిమెట్ల సమీపంలో జాతీయ రహదారిపై పల్టీ కొట్టిన కారు

కుత్బుల్లాపూర్: అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో కొంపల్లి వైపు నుంచి సుచిత్ర వస్తున్న హోండా సిటీవెర్న కారు (కేఏ03 ఎన్‌జీ 0205) ఓల్డ్ జీడిమెట్ల సిగ్నల్ దాటిన తర్వాత కొద్ది దూరంలో చెన్నై షాపింగ్‌మాల్ ముందు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ అందులో ఉన్న ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అవడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదం జరిగిన సందర్భంలో కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నారని వారు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. అయితే కారు పల్టీ కొట్టిన విషయం సాయంత్రం వరకు పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

ఎందుకో.. ఏమైందో.!

20 రోజుల్లోనే కూల్చేశారు



- ఎన్సీఎల్‌కాలనీలో మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయం ఏర్పాటు
- నిర్మాణానికి రూ.50లక్షలకు పైగా వెచ్చించిన అధికారులు
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే
- అంతలోనే కూల్చివేయడంపై సర్వత్రా విమర్శలు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని ఈనెల 5వ తేదీన రాష్ట్ర కార్మికమంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. 20 రోజులు గడవక ముందే ఏమైందో ఏమో.! లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సదరు నిర్మాణాన్ని ఆదివారం కూల్చివేయడం చర్చానీయాంశంగా మారింది.

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ పరిధిలో ఉన్న ఎన్సీఎల్ కాలనీ సమీపంలో గతంలో రెవెన్యూ అధికారులు పోలీసు శాఖకు స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు స్థలంలో కొత్తగా ఏర్పడ్డ మేడ్చల్ డీసీపీ ట్రాఫిక్ విభాగ శాఖలు ఏర్పాటు చేసి ఇక్కడి నుంచే పరిపాలన కొనసాగిస్తూ వచ్చారు. తాత్కాలిక కార్యకలాపాల కోసం షెడ్డు, గదులను నిర్మించారు. దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈ కార్యాలయాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. సుమారు రూ.50లక్షల నిధులు వెచ్చించి ఈ నిర్మాణం పూర్తి చేశారు. అంతలో ఏమైందో ఏమో కానీ మొత్తం మీద సదరు షెడ్డు, గదులను ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది దగ్గరుండి జేసీబీలతో తొలగించే ప్రక్రియ చేపట్టడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

హెచ్‌ఎండీఏ పరిధిలో రోడ్డు..?

కొన్నేళ్ల క్రితం రెవెన్యూ శాఖ అధికారులు ఇక్కడ పోలీస్ శాఖకు కొంత స్థలాన్ని కేటాయించారు. కొత్తగా ఏర్పడ్డ మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని ప్రారంభించుకోగా గ్రేటర్ అధికారులు ఈ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో హెచ్‌ఎండీఏ మ్యాప్ ప్రకారం రోడ్డుగా చూపించారన్నారు. ఎటువంటి అనుమతి లేకుండా నిర్మించిన సదరు నిర్మాణాన్ని తొలగించాలని కోరినట్లు సమాచారం.

◆ ఈ కూల్చివేతల విషయంపై ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావును ‘సాక్షి’ వివరణ కోరే ప్రయత్నం చేయగా ఫోన్ లేపలేదు. ఇదే క్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డిని వివరణ కోరగా హెచ్‌ఎండీఏ లో రోడ్డుగా ఉందని తేలడంతో తామే స్వచ్ఛందంగా వాటిని తొలగిస్తున్నామని చెప్పడం గమనార్హం. ఎటువంటి అనుమతులు లేకుండా, షెడ్డు గదులను నిర్మించడమే కాకుండా లక్షలాది రూపాయలు వృథా కావడం ఇప్పుడు చర్చగా మారగా, ప్రస్తుతం మేడ్చల్ డీసీపీ కార్యాలయం ఎక్కడ అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



హంగు ఆర్భాటంగా ఈ నెల 5వ తేదీన ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, పోలీసు ఉన్నతాధికారులు (ఫైల్ ఫొటో)

బీఆర్‌ఎస్ నేత కుటుంబానికి రూ.5లక్షల చెక్కు



చెక్కును అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచీగా మారాయని బీఆర్‌ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్ తాండా–1కు చెందిన బీఆర్‌టీయూ అనుబంధ టాక్సీ డ్రైవర్ మాలోతు రాజు ఇటీవల విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రమాద బీమా పథకం కింద రూ.5 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. సదరు మొత్తాన్ని ఆదివారం చెక్కు రూపంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి అందజేశారు.

◆ అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లక్షలాది మందికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టాక్సీ సెక్టార్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అత్తినమోని నాగేష్‌కుమార్, కంటోన్మెంట్ మాజీ బోర్డ్ సభ్యులు పాండు యాదవ్, జాయింట్ సెక్రటరీ జిల్లెల్ల మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గాజులపాటి నరేష్, సీసీడీపీ కిరణ్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం



రంగారెడ్డినగర్: జూనియర్ ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థిని సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన నీలం జ్యోతిర్మయి ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో స్టేట్ ర్యాంక్ సాధించింది. ఆదివారం కాలనీకి చెందిన బాపూజీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో సభ్యులు విద్యార్థిని జ్యోతిర్మయికి మెమోంటో అందజేసి సత్కరించారు. క్రమశిక్షణతో చదువుతూ భవిష్యత్‌లో మంచి ర్యాంక్‌లు సాధించాలని అసోసియేషన్ సభ్యులు అభిలాషించారు. సంఘం ఉపాధ్యక్షుడు దున్నాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి విజయబాబు, వెంకటరమణ, నిర్వాహకులు శ్రీనివాస్‌గుప్తా, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట



తిరుపతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్: కార్యకర్తల సంక్షేమానికి బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపీట వేస్తుంతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తిరుపతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆదివారం బాలయ్యనగర్‌కు చేరుకుని తిరుపతి కుటుంబాన్ని పరామర్శించి అయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ కాలనీ వాసులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేయగా స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మృతి చెందిన తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా..



ఎస్సై ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి రూ.25 లక్షల చెక్కును అందజేస్తున్న 2014 బ్యాచ్ ఎస్సై బృందం

దుండిగల్: విధులు నిర్వర్తిస్తుండగా గుండెపోటుతో మృతి చెందిన ఎస్సై కుటుంబానికి తోటి బ్యాచ్ ఎస్సైలు అండగా నిలిచారు. దుండిగల్ పీఎస్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌రెడ్డి డ్యూటీలో ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. దీంతో అతని కుటుంబం ఇంటి పెద్దను కోల్పోయింది. 2014 బ్యాచ్ ఎస్సైల బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి తోటి ఎస్సైలు బాసటగా నిలిచి ఆదివారం తమ సొసైటీ నుండి రూ.25 లక్షలు చెక్కును అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని ఓదార్చిన ఎస్సైల బృందం అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ముదిరాజ్‌ల నిరసన



బాచుపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్ కులస్తులు

నిజాంపేట్: ముదిరాజ్ కులస్తులపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం బాచుపల్లి మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులపై ఇష్టానుసారంగా మాట్లాడి కౌశికరెడ్డి పెద్ద తప్పిదం చేశారన్నారు. అదే విధంగా ముదిరాజ్ కులానికి చెందిన జర్నలిస్ట్ అజయ్ ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసే ప్రయత్నంలో ఎమ్మెల్సీ అనుచరులు దాడికి పాల్పడం హేయమైన చర్య అన్నారు. కులాల మధ్య చిచ్చు రేపే విధంగా వాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డి బేషరుతుగా ముదిరాజ్ కులస్తులకు క్షమాపణలు చెప్పారని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఎమ్మెల్సీని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, కాసాని సుధాకర్‌ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారాయణ ముదిరాజ్, శంకర్, చిట్టి, సురేష్‌ముదిరాజ్, ఆగయ్య ముదిరాజ్, నవీన్‌ముదిరాజ్, మహేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన యువకులతో భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్‌కు చెందిన చైతన్య, సాయిగౌడ్‌ల మిత్ర బృందం 200 మంది యువకులతో కాంగ్రెస్ పార్టీలో చేరగా భూపతిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

– ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుద్యోగ భృతి, ఇంటింటికి ఉద్యోగం పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అది కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. యువత కాంగ్రెస్ పార్టీపై మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ చేరికలే అందుకు ఉదాహరణ అన్నారు.

◆ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మీ, కుత్బుల్లాపూర్ ఏ–బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, 129 డివిజన్ ఇన్‌చార్జ్ నీలి రహ్మతుల్లా, ఓబీసీ సెల్ రాష్ట్ర కో.ఆర్డినేటర్ భరత్ గౌడ్, రాముగౌడ్, ధ్రువ, భాస్కర్, పూర్ణచందర్, బత్తుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఎంఎస్‌దే విజయం



లేబర్ కమిషనర్‌కు సమర్పించిన లేఖ కాపీని మల్లారెడ్డికి అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

సుభాష్‌నగర్: కార్మికుల సంక్షేమానికి, వారి హక్కుల సాధనకు బీఎంఎస్ పని చేస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కొంపల్లిలోని హిల్టన్ టొబాకో పరిశ్రమకు చెందిన బీఎంఎస్ నాయకులు ఆదివారం మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. లేబర్ కమిషనర్‌కు పరిశ్రమలో ఎన్నికలు నిర్వహించాలని సమర్పించిన లేఖ కాపీని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హిల్టన్ టొబాకో పరిశ్రమ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం, సదుపాయాలు కల్పించేందుకు గతంలో బీఎంఎస్ కృషి చేసిందన్నారు. కాని ప్రస్తుత కార్మిక సంఘం పరిశ్రమ యాజమాన్యంలో చేతులు కలిపి కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఎంఎస్ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఎంఎస్ యూనియన్ నాయకులు ఎల్లారెడ్డి, సంపత్, చారి, రాజు, భూపాల్‌రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

ఏపీజీ ఆధ్వర్యంలో ప్రజా సదస్సు



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

కుత్బుల్లాపూర్: అసోసియేషన్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్ (ఏపీజీ) ఆధ్వర్యంలో ఆదివారం కుత్బుల్లాపూర్‌లోని కృష్ణకుంజ్ అపార్ట్‌మెంట్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జయశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్య ప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావుతో పాటు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, నటరాజ్ గౌడ్, జగదీష్, పులి బలరామ్, అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ కెప్టెన్ సునీల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణకుంజ్ అపార్ట్‌మెంట్‌వాసులతో మురళీధర్‌రావు, కూన శ్రీశైలంగౌడ్ తదితరులు

డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను మెరుగు పరుస్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్



గాజులరామారం ఆర్కే టౌన్‌షిప్‌లో భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అనవారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని ఆర్కే టౌన్‌షిప్‌లో రూ.1.95 కోట్లతో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను మెరుగు పర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా కోట్ల రూపాయల నిధులు వెచ్చించి ప్రజల అవసరాలను తీరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం అప్పల నాయుడు, మేనేజర్ రోహిణి, ఆర్కే టౌన్‌షిప్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవంలో..

బోనాల పండుగ సందర్భంగా లోయర్ ట్యాంక్ బండ్ వద్ద శ్రీ కనకాల కట్టమైసమ్మ తల్లి జాతరకు దుండిగల్ నుంచి శాలివాహన కుమ్మర సంఘం కమిటీ ఆధ్వర్యంలో బోనాలతో వెళ్తున్న నేపథ్యంలో బోనాల ఉత్సవాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన సొంత నిధులతో సుమారు 150 మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిసంగి వెంకటేశం, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌యాదవ్, కౌన్సిలర్లు జక్కుల కృష్ణాయాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

జగన్నాథ రథయాత్రలో..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ శ్రీసీతారామచంద్ర ఆలయం నుంచి బాచుపల్లి వరకు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో పూరి జగన్నాథ రథయాత్రను చేపట్టారు. ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండు, కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, ఆగం రాజు ముదిరాజ్, రవి కిరణ్, ఆవుల పావని జగన్‌యాదవ్, గాజుల సుజాత, కొలన్ వీరేందర్ రెడ్డి, బాలాజీ నాయక్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల జగన్ యాదవ్, కోలన్ సునీల్ రెడ్డి, మహిళా నాయకురాలు సబిత జలంధర్ రెడ్డి. భక్తులు పాల్గొన్నారు.



నిజాంపేట్‌లో శ్రీజగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి